సాక్షి
నిర్మల్

మంగళవారం ၊ 9 ၊ జూలై ၊ 2024

జోహార్ వైఎస్సార్



ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఖానాపూర్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలు సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు దయానంద్, నిమ్మల రమేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోశ్, నాయకులు షౌకత్‌పాషా, లక్ష్మీపతిగౌడ్, రాజేశ్వర్, శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టి

నిర్మల్‌టౌన్: మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో బాలుడు బైక్ నడపడాన్ని చూసిన ఎస్పీ వాహనాన్ని తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాన్ని సీజ్ చేసి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరో బైక్‌పై నలుగురు బాలురు ప్రయాణిస్తుండగా ఆ బైక్‌ను కూడా సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొత్త చట్టాల ప్రకారం డ్రైవింగ్ చేస్తున్న మైనర్ల వాహనాలు సీజ్ చేసి, వారితో పాటు వారి తల్లిదండ్రులను కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు.

నాన్ టీచింగ్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న నాన్ టీచింగ్ వర్కర్లు

నిర్మల్‌చైన్‌గేట్: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న మాట్లాడుతూ కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్‌తో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బేసిక్ పే నిర్ణయించి జీతాలు చెల్లించాలని, రిటైర్మెంట్ అవుతున్న మహిళా కార్మికులకు పదవీ విరమణ పారితోషికం కింద రూ.10 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి కె.కవిత, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మి, కేజీబీవీ జిల్లా అధ్యక్షురాలు రూప, సహాయ కార్యదర్శి పార్వతి, ఉపాధ్యక్షురాలు విజయ, తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సునారికారి రాజేశ్

ఖానాపూర్: బీడీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సునారికారి రాజేశ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని అర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీడీ కార్మికులకు చేయూత పథకం కింద ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.4 వేలు ఇవ్వాలని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచుతూ జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై పాలకుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 10న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు లింగన్న, జెవింద్, చిన్నరాజన్న, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాస్‌లకు చార్జీలు చెల్లించండి

నిర్మల్‌టౌన్: ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు బస్‌పాస్ పొందడానికి యాజమాన్యం ఆర్టీసీకి అడ్మినిస్ట్రేషన్ చార్జీలు చెల్లించి స్కూల్ పేరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కాలేజీలో యాజమాన్యం ఫ్రెష్ అయితే రూ.6వేలు, రినివల్ అయితే రూ.5 వేలు చెల్లించాలని, ఇంటర్‌కు ఫ్రెష్ అయితే రూ.5 వేలు, రినివల్‌కు రూ.4 వేలు, విద్యార్థుల సంఖ్య 200 ఉంటే రూ.750, 500 ఉంటే రూ.1000 , ఇంకా ఎక్కువగా ఉంటే రూ.1500 నుంచి 2000 చెల్లించాలని సూచించారు. ఈ చార్జీలను అకౌంట్ ఆఫీసర్ టీఎస్ ఆర్టీసీ ఆదిలాబాద్ పేరు పైన డీడీ తీసి నిర్మల్ బస్టాండ్‌లోని కౌంటర్‌లో అందజేయాలని సూచించారు.

దేగాంవాసికి యంగ్ అచీవర్ అవార్డు

భైంసాటౌన్: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన నేత్ర వైద్య నిపుణులు కే శేఖర్‌ను యంగ్ అచీవర్ అవార్డు వరించింది. ఈ నెల 6న పంజాబ్ లోని లుధియానా క్రిస్టియన్ మెడికల్ కళాశాల 18వ వార్షికోత్సవం సందర్భంగా కంటి వైద్యరంగంలో అందిస్తున్న సేవలకుగానూ విజన్–2020 ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ అవార్డుతో సత్కరించింది.

ప్రాజెక్టులపై ఆశలు..



మామడ మండలంలోని సదర్మాట్ ప్రాజెక్టు

- తక్కువ సమయంలో పూర్తి చేసేందుకు..
- చివరిదశ పనులకు నిధుల అంచనా
- ఏడాదిలోపు పనుల పూర్తికి సీఎం ఆదేశం
- జిల్లాలో సదర్మాట్, పిప్రి ఎత్తిపోతల పథకాలు

నిర్మల్: రాష్ట్రంలోని గోదావరి బేసిన్‌లో దీర్ఘకాలంగా కొనసాగుతున్న పలు ప్రాజెక్టుల పనులను పూర్తిచేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మొత్తం ఆరు ప్రాజెక్టులను గుర్తించగా ఇందులో జిల్లాలోని సదర్మాట్ బ్యారేజ్, పిప్రి ఎత్తిపోతల పథకం ఉన్నాయి. ఏళ్లుగా కొనసాగుతున్న సదర్మాట్ పనులు దాదాపు చివరిదశకు చేరుకున్నాయి. తక్కువ మొత్తంతో తక్కువ సమయంలోనే ఈ పనులు పూర్తిచేసేలా ప్రతిపాదనలు చేయాలన్న సీఎం సూచనల మేరకు నీటిపారుదల శాఖాధికారులు ప్రతిపాదించారు. వీటికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

జిల్లాలో రెండు పథకాలు..

గోదావరి పరీవాహకంలోని నీల్వాయి, పాలెం వాగు, మత్తడివాగు, ఎస్సారెస్పీ స్టేజీ–2లతో పాటు జిల్లాలోని సదర్మాట్ ఆనకట్ట, పిప్రి ఎత్తిపోతల పనులను తక్కువ సమయంలో పూర్తిచేయొచ్చని నీటిపారుదల శాఖాధికారులు గుర్తించారు. ఈ ప్రాజెక్టుల పనులు మొత్తం పూర్తి కావడానికి రూ.241 కోట్లు ఖర్చు అవుతుందని, 48 వేల ఎకరాలకు సాగునీరందుతుందని శాఖాధికారులు అంచనా వేశారు.



లోకేశ్వరం మండలంలోని పిప్రి ఎత్తిపోతల పనులు(ఫైల్)

పిప్రి ఎత్తిపోతల పూర్తికి..

లోకేశ్వరం మండలంలో శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో పిప్రి ఎత్తిపోతల పథకాన్ని 2021 ఫిబ్రవరి బడ్జెట్‌లో మంజూరు చేశారు. ఇందుకు రూ.58 కోట్ల 90 లక్షలు కేటాయించారు. పనులు ప్రారంభమైనప్పటికీ మరిన్ని నిధులు అవసరమవుతాయన్న అంచనాలను సిద్ధం చేశారు. ఈ పథక నిర్మాణం పూర్తయితే ఆరు గ్రామాల్లోని 4,800 ఎకరాలకు సాగునీరు అందనుంది.

'సదర్మాట్' ఎదురుచూపు..

మామడ మండలం పొన్కల్ సమీపంలో గోదావరినదిపై సదర్మాట్ బ్యారేజీ నిర్మాణం పనులు 2016 అక్టోబర్ 25న ప్రారంభమయ్యాయి. గడువు దాటినా బ్యారేజీ నిర్మాణం పూర్తి చేయడంలో జాప్యం జరుగుతోంది. ఈ నిర్మాణంతో నిర్మల్, జగిత్యాల జిల్లాలకు చెందిన దాదాపు 1,176 ఎకరాల వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నాయి. రెండు జిల్లాల పరిధిలో 18,016 ఎకరాల వ్యవసాయ భూములకు సాగు నీరు అందనుంది. నిర్మల్ జిల్లాలో 13,120 వేల ఎకరాలు, జగిత్యాల జిల్లాలో 4,896 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందనుంది. నిర్మాణ వ్యయం రూ.554.28 కోట్లు కాగా ఇందులో నుండి గతేడాది వరకు రూ.379.4 కోట్ల చెల్లింపులు జరిగాయి. బ్యారేజీ నిర్మాణ పనులకు రూ.274.5కోట్లు, భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారంగా రూ.104.9 కోట్లు పంపిణీ చేశారు. ఇంకా పరిహారం అందనివారు ఉన్నారు. దిగువకు నీటిని వదలడానికి బ్యారేజీకి 55గేట్లు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో పలుమార్లు డెడ్‌లైన్లు పెట్టినప్పటికీ నిధుల విడుదలలో జాప్యంతో ఇక్కడ పనులూ అదేతీరులో సాగుతున్నాయి. దాదాపు నిర్మాణ పనులు పూర్తయ్యాయని, విద్యుత్, ఇతర చివరిదశ పనులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఏడాదిలోపు..

2025 మార్చినాటికి ఈ పథకాల పనులను పూర్తిచేయాలని సీఎం నీటిపారుదల శాఖాధికారులను ఆదేశించారు. ఇప్పటికే అంచనాలను ప్రభుత్వానికి అందించడంతో సంబంధిత నిధులు మంజూరు కానున్నాయి. తక్కువ వ్యయంతో పాటు పనులు కూడా దాదాపు చివరిదశలోనే ఉండటంతో గడువులోగా పూర్తి అవుతాయని అధికారులు చెబుతున్నారు. మరోవైపు గతంలోనూ ప్రభుత్వం గడువులు పెట్టినా పనులు కాలేవని, ఈసారైనా పూర్తిచేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



జోరు వాన

జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి వాతావరణం చల్లబడటంతో జిల్లావాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లాలంటే ప్రజలు గొడుగులు పట్టుకొని, రేన్ కోట్లు ధరించి బయటికి వెళ్తున్నారు. జోరువానలో కూడా వాహనదారులు హుషారుగా వెళ్తూ కనిపించారు. ఆ దృశ్యాలను 'సాక్షి' కెమెరాలో క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్





'తొడిశెట్టి'కి రాష్ట్రస్థాయి పురస్కారం



పురస్కారాన్ని స్వీకరిస్తున్న తొడిశెట్టి పరమేశ్వర్

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖకవి, సాహితీవేత్త, ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు తొడిశెట్టి పరమేశ్వర్ రాష్ట్రస్థాయి సాహితీ పురస్కారం అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియం వేదికగా శాలివాహన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 'విశిష్ట సాహితీ ప్రతిభా పురస్కారం' స్వీకరించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వరకవి సిద్ధప్ప జయంతిని పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాల్లోని సాహిత్యం, కళలు, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబరిచిన వ్యక్తులను గుర్తించి శాలివాహన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పురస్కారాలను అందజేశారు. అందులో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి రచయిత తొడిశెట్టి పరమేశ్వర్ పురస్కారాన్ని స్వీకరించడం విశేషం. సోన్ మండలంలోని జాఫ్రాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఆయన 'అక్షర సౌరభాలు, మొల్లమాంబ సాహితీ వైభవం, వైజ్ఞానిక సౌరభాలు, స్ఫూర్తినిచ్చిన శాస్త్రవేత్తలు' వంటి పుస్తకాలు రచించారు.

స్థానిక ఎన్నికల్లోనూ సత్తా చాటుదాం

- ఎంపీ గోడం నగేశ్



మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

భైంసాటౌన్: అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం సత్తా చాటాలని ఎంపీ గోడం నగేశ్ పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో ముథోల్ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో గెలుపొందిన నేపథ్యంలో సోమవారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభకు హాజరై మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించిన పార్టీ కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజాభీష్టం మేరకు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. స్థానిక ఎన్నికల్లో విజయం కోసం ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసి పని చేస్తానన్నారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలో లేకున్నా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి పని చేస్తామన్నారు. గుండెగాం పునరావాసం, పిప్రి ఎత్తిపోతల, బాసర ఆలయ అభివృద్ధికి, రైల్వే స్టేషన్‌లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామన్నారు. బాసర నుంచి మాహూర్ వరకు రహదారి అనుసంధానానికి కృషి చేయాలని ఎంపీ నగేశ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి పాండే, నారాయణ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, నాయకులు బీ.గంగాధర్, రమేశ్, భీం రావు, పట్టణాధ్యక్షుడు మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

భైంసాటౌన్: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఎమ్మెల్యే పి రామారావుపటేల్‌తో కలిసి స్కానింగ్ యంత్రం, ఓపీడీ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఆస్పత్రి వైద్యులు ఎమ్మెల్యే, ఎంపీలను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, వైద్యులు అనిల్, విజయానంద్, తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు అండగా పోలీసులు

- ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: పోలీసులు సామాన్యులకు అండగా ఉండాలని, వారితో స్నేహభావంగా మెలగాలని ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన పోలీసు వ్యవస్థను జిల్లా ప్రజలకు అందించడమే లక్ష్యమన్నారు. పోలీసుల సహాయం కావాలనుకునేవారు ఠాణాలో నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపించినా సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని తెలిసినా వెంటనే 8712659599 వాట్సాప్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ సస్పెన్షన్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ రాములును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ అభిలాష అభినవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఔట్ సోర్సింగ్ టెండర్ల వ్యవహారంలో నిబంధనలు ఉల్లంఘించినట్లు అధికారిపై పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అర్హతలు లేని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను సైతం టెండర్ ప్రక్రియలో పాల్గొనేందుకు అవకాశం కల్పించడమే కాకుండా ఆ ఏజెన్సీకి అనుకూలంగా ఓ డాక్యుమెంట్‌ను సైతం టెండర్ ప్రక్రియలో దాఖలు చేశారన్న ఆరోపణతో పాటు మరికొన్ని ఆరోపణలపై కలెక్టర్ సీరియస్‌గా స్పందించారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన కలెక్టర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువరించారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అభిలాష అభినవ్ కొద్దిరోజుల్లోనే ఫిర్యాదులపై స్పందించి ఓ జిల్లాస్థాయి అధికారిని సస్పెండ్ చేయడంతో కలెక్టరేట్‌లో కలకలం మొదలైంది.

దరఖాస్తుల పరిశీలన వేగంగా పూర్తిచేయాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

- కలెక్టర్ అభిలాష అభినవ్
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజావాణి దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అభిలాష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ధరణి, రెవెన్యూ, వ్యవసాయం, కొత్త రేషన్ కార్డులు, ఫించన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇతర భూ సమస్యల వంటి అంశాలపై ఫిర్యాదులు అధికంగా వచ్చాయని, సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీరు నిలువ ఉండే ప్రదేశాలు, డ్రెయినేజీలలో యాంటీలార్వా వృద్ధి చెందకుండా నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో క్రమం తప్పకుండా డ్రై డే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వసతిగృహాల్లో విద్యార్థులకు ఫీవర్ సర్వే నిర్వహించి రిపోర్టు అందజేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, డీఆర్వో భుజంగ్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

భైంసాలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వెంటనే ఇవ్వాలని లబ్ధిదారులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు మాట్లాడుతూ లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదన్నారు. ఖాళీగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయన్నారు.

పరిహారం ఇప్పించండి..



కలెక్టరేట్‌లో రాంపూర్, మైసంపేట్ వాసులు

కడెం: పునరావాస పరిహారం ఇప్పించాలని రాంపూర్, మైసంపేట్ వాసులు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసి విన్నవించారు. సాగు భూమిని సిద్ధం చేసేవరకు పాత గ్రామాల్లోని భూములకు వచ్చే రైతు భరోసా, పీఎం కిసాన్ సాయం అందించాలని, రూ.15 లక్షల ప్యాకేజీ అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నర్సయ్య, రాజం, జగ్గారావు, ఎల్లయ్య, జయవంత్‌రావు కలెక్టర్‌ను కోరారు.

వీడీసీ సభ్యులు అడ్డుపడుతున్నారు



జాం మండలంలోని 582/63 సర్వేనంబర్‌లో ఉన్న ఐదు ఎకరాల వ్యవసాయ భూమిని నాతోటి సైనికుడు వెంకటేష్ నుంచి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నా. కానీ ఇప్పుడు వీడీసీ సభ్యులు ఆట్టి భూమిని సాగు చేసుకోకుండా అడ్డుపడుతున్నారు.

– భూపాల్ రెడ్డి, జాం

పదేళ్లుగా తిరుగుతున్నా



కుంటాల మండలం ఎర్రర్ శివారులోని అంబకంటిలో మా అమ్మ పేరు మీద పాత సర్వే నంబర్ 220లో 2.05 గుంటల భూమి రిజిస్టర్ అయి ఉంది. అట్టి భూమి నా పేరు మీద ఎక్కించమని పదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది.

– గజవరి విఠల్, అంబకంటి, కుంటాల

అక్రమంగా పట్టా చేసుకున్నారు



బుట్టాపూర్‌లో సర్వే నంబర్ 133/ఉ లో 38 గుంటల పట్టా భూమిని పంచుకోకుండా మా తాతలకు గుర్తుగా ఉంచుకున్నాం. అట్టి భూమిని మాకు తెలియకుండా గ్రామ మాజీ సర్పంచ్ తన తల్లి పేరిట పట్టా చేయించుకున్నాడు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

– గంగయ్య, బుట్టాపూర్

ఎంఈవో పోస్టులకు పదోన్నతులు కల్పించాలి

నిర్మల్ రూరల్: ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ రూల్స్ రూపొందించి ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులకు పదోన్నతులు కల్పించాలని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు జుట్టు గజేందర్ ఒక ప్రకటనలో కోరారు. 2017లో ఉపాధ్యాయ సర్వీస్ రూల్స్‌కు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు సాధించుకున్నప్పటికీ నాటి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే అమలుకు నోచుకోలేదన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారం అయితే ఎంఈవోలతో పాటు డిప్యూటీ ఈవో, డైట్ లెక్చరర్లు వంటి దాదాపు వెయ్యి పోస్టుల వరకు పదోన్నతులకు మార్గం సుగమమవుతుందన్నారు.

క్లుప్తంగా

భారత్ జోడో సదస్సుకు నిర్మల్ వాసి


సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

నిర్మల్‌ఖిల్లా: మహారాష్ట్రలోని వార్ధాలో గల సేవాగ్రామ్ ఆశ్రమంలో నిర్వహిస్తున్న భారత్ జూడో అభియాన్ జాతీయ సదస్సులో నిర్మల్ జిల్లాకు చెందిన స్వదేశ్ పరికిపండ్ల పాల్గొంటు న్నారు. ఈ నెల 8, 9 వ తేదీల్లో నిర్వహించ నున్న జాతీయస్థాయి సమావేశానికి ప్రవాస మిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్లకు చోటు దక్కింది. దేశవ్యాప్తంగా ఉన్న పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలు, మేధా వులు ఈ సదస్సులో పాల్గొంటుండగా కార్మిక సంక్షేమం పట్ల రాష్ట్రస్థాయిలో సేవలందిస్తున్న స్వదేశ్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. తెలం గాణ రాష్ట్రం నుండి స్వదేశ్‌తో పాటు సామా జిక కార్యకర్త కవిత కురుగంటి, తెలంగాణ కన్వీనర్ వీస్సా కిరణ్, రైతు స్వరాజ్య వేదిక అధ్యక్షుడు కన్నెగంటి రవి, తదితరులు ఇందు లో పాల్గొంటున్నారు.

ఆలయంలో చోరీకి యత్నం

భైంసాటౌన్: పట్టణంలోని పద్మావతికాలనీలో గల వేంకటేశ్వరాలయంలో ఆదివారం రాత్రి చోరీకి యత్నించిన దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు. ముధోల్ మండలం ముద్గల్‌కు చెందిన నాగుల రాజు ఆలయంలో చోరీకి యత్నిస్తుండగా గమనించిన స్థానికు లు పట్టుకుని పోలీసులకు సమాచారమిచ్చా రు. పోలీసులు దొంగను అదుపులోకి తీసుకు ని సోమవారం కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు. రాజు గతంలో ముధోల్ మండలంలోని పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడినట్లు వారు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో మేక మృతి


మృతి చెందిన మేక

భైంసాటౌన్: పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెం దిన శ్రీను మేక కుభీర్ చౌరస్తా ప్రాంతంలో సోమవారం మేత కోసం ట్రాన్స్‌ఫార్మర్ వి ద్యుత్ తీగలకు తగిలి మృతి చెందింది. దీంతో రూ.15వేల వరకు నష్టపోయినట్లు రైతు తెలి పారు. వేలాడుతున్న విద్యుత్ తీగల విషయ మై విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయా డు. నష్టపరిహారం చెల్లించాలని కోరాడు.

కుక్కకాటుతో ముగ్గురికి గాయాలు

భైంసారూరల్: మండలంలోని సుంక్లి గ్రామం లో కుక్కకాటుతో ముగ్గురికి గాయాలయ్యా యి. సోమవారం ఉదయం గ్రామానికి చెం దిన సాగర, ముత్యం, నర్సయ్యలను కుక్క కాటు వేయడంతో అక్కడున్నవారు అప్రమ త్తమై వాటిని తరిమేశారు. గాయాలపాలైన ముగ్గురిని భైంసా ఏరియా ఆసుపత్రికి తర లించి చికిత్స అందిస్తున్నారు.

నాడు అలా.. నేడు ఇలా..


నాడు చెరువు నీరు తూము ద్వారా బయ టికి వెళ్లేందుకు వీలుగా ఉన్న నాలా


నేడు అదే కాల్వపై మట్టి పోయడంతో కనిపించకుండా పోతున్న నాలా

నాడు ఇబ్రహీం చెరువు కింద ఉన్న తూము నుంచి బయటకు వచ్చిన నీటితో చెరువును తలపిస్తున్న ప్రాంతం



నేడు తూమును కబ్జా చేసి పోసిన మట్టి




నాడు చెరువులోని తూము నుంచి వచ్చే నీరు వెళ్లే నాలా


నేడు కాల్వపై మట్టిపోయడంతో కనిపించకుండా పోయిన నాలా

నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌లో ఇబ్రహీం చెరువు తూము కూల్చివేతలు శరవేగంగా జరుగుతున్నాయని కాలనీవాసులు పేర్కొంటున్నారు. తూముకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు పట్టాలు చేసుకుని యథేచ్ఛగా నాలాలను సైతం కబ్జా చేసి మట్టి పోసి మాయం చేస్తున్నారు. అధిక వర్షాలు కురిస్తే ఈ చెరువు నుండి తూము ద్వారా నీటిని బయటకు విడుదల చేస్తారు. తూముద్వారా వచ్చిన నీరంతా నివాస గృహాల మధ్యలో నిలిచి ఉండడంతో దుర్గంధం వెదజల్లడమే కాకుండా ఈగలు, దోమలకు ఆవాసంగా మారుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కొందరు తూము నుంచి వచ్చే నీరు బయటకు వెళ్లేందుకు వీలు లేకుండా నాలాను కూడా కబ్జా చేశారు. దీంతో నీరు ఎటూ వెళ్లలేక ఇళ్లమధ్యలోనే ఉంటుండడంతో అధికారుల తీరుపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

చిత్రం గీసి.. అభిమానం చాటి



తలమడుగు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రాన్ని గీసి తన అభిమానాన్ని చాటాడు తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన గట్టు రాజు. వైఎస్సార్ జయంతి సంద ర్భంగా ఆ మహానేతపై ఉన్న అభిమానంతో పెన్సిల్‌తో చిత్రాన్ని గీసినట్లు చిత్రకారుడు రాజు తెలిపాడు.

సౌదీలో దండేపల్లి వాసి మృతి

- ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలింపు
- చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్
- అవయవదానంతో నలుగురు విదేశీయులకు పునర్జన్మ


మృతుడు వెంకటేశ్(ఫైల్)


మరణ వార్త తెలియడంతో విషాదంలో కుటుంబ సభ్యులు

దండేపల్లి:ఉపాధి నిమిత్తం సౌదీ వెళ్లిన దండేపల్లి మండలం పాత మామిడిపల్లికి చెందిన పత్తిపాక వెంకటేశ్(41)ఫిట్స్‌తో అక్కడ మృతిచెందాడు. ఈమేరు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే వెంకటేశ్ ఉపాధి నిమిత్తం గతేడాది జూన్ 21న సౌదీ వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న అతనికి ఈనెల 3న ఫిట్స్ రావడంతో తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే కోమాలోకి వెళ్లినట్లు తెలిపారు. వైద్యులు చికిత్స అందించినా ఫలితం లేకుండా పోయింది. ఆదివారం అర్ధరాత్రి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. వెంకటేశ్ మరణవార్త తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. అతడికి భార్య సరిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వెంకటేశ్ మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి తెప్పించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను బంధువులు కలిసి కోరారు.

గొప్పమనసు చాటుకున్న బాధిత కుటుంబం..

ఇదిలా ఉండగా వెంకటేశ్ కుటుంబం పెట్టెడు దుఃఖంలోనూ గొప్ప మనసు చాటుకుంది. దుబయ్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతిచెందడంతో అక్కడి ఆస్పత్రిలోని అవయవదాన ట్రస్టు సభ్యులు, వైద్యులు వెంకటేశ్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అవయవదానం చేస్తే నలుగురికి కొత్త జీవితం ప్రసాదించినట్లు అవుతుందని తెలిపారు. వారి విజ్ఞప్తి మేరకు వెంకటేశ్ కళ్లు, కిడ్నీలు దానం చేసేందుకు వెంకటేశ్ భార్య సరిత అనుమతి ఇచ్చింది. మరణించిన వెంకటేశ్ మరో అవయవదానం తో మరో నలుగురికి పునర్జన్మ ప్రసాదించాడు.

మహిళా న్యాయవాదిపై దాడి..?

- సోషల్ మీడియాలో వీడియో వైరల్

బెల్లంపల్లి: భర్త ఉండి తప్పుడు సమాచారంతో ఒంటరి మహిళ ఫించన్ పొందుతూ ప్రభుత్వాన్ని మోసగిస్తోందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినందుకు తనపై ఓ మహిళ దాడి చేసిందని బెల్లంపల్లికి చెందిన ఓ మహిళ న్యాయవాది వీడియో విడుదల చేసింది. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చిప్పరి విక్టోరియా అనే మహిళ బెల్లంపల్లిలోని రడగంబాల బస్తీలో భర్త కరుణాకర్, పిల్లలతో నివాసం ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఒంటరి మహిళ ఫించన్ తీసుకుంటుంది. ఈ మేరకు న్యాయవాది గాదవేణ మమత ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఆ విషయంపై మాట్లాడుకుందామని రడగంబాల బస్తీలో ఉన్న హనుమాన్ ఆలయం వద్దకు రావాలని మమతకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడకు వెళ్లిన తనపై మెప్మా ఆర్పీల సమక్షంతో విక్టోరియా, ఆమె కూతురు నందిని దాడి చేశారని, విక్టోరియా భర్త కరుణాకర్ తీవ్రంగా దూషించాడని మమత వీడియోలో ఆరోపించారు. తాను గర్భిణి అని కూడా చూడకుండా భౌతికంగా దాడి చేశారని కన్నీరు పెట్టుకుంది. ఎమ్మెల్యే పీఏ ప్రసాద్ అండతో తనపై దాడిచేశారని తెలిపింది. ఈ ఘటనను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తానని పేర్కొంది. ఇదిలా ఉంటే.. ఓ పొదుపు సంఘంలో నిధుల దుర్వినియోగం జరగడంతో మమత తల్లి, ఆడబిడ్డపై ఏడాదిక్రితం చీటింగ్ కేసు నమోదు చేశామని టూటౌన్ ఎస్సై రమేశ్ తెలిపారు. ఈ విషయంలో కాంప్రమైజ్ కావాలని విక్టోరియాపై న్యాయవాది మమత ఒత్తిడి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం మాట్లాడుకునే క్రమంలో మాటామట పెరిగి వీడియో తీస్తున్న బాలికపై మమత చేయిచేసుకుందని చెప్పారు. దీతో విక్టోరియా, మమత పరస్పరం కొట్టుకున్నారని తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

తలమడుగు: సెల్‌ఫోన్ ఇప్పుడెందుకని తల్లి దండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం.. మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన మేస్రం కృష్ణ (18) నెల రోజులుగా తమ తల్లిదండ్రులను సెల్‌ఫోన్ కొనివ్వమని అడిగాడు. ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఇప్పుడు నీకెందుకు ఫోన్ అని మందలించడంతో ఈనెల 3న ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెదికినా ఆచూకీ లభించలేదు. గ్రామ సమీపంలోని కొండపైన చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకొని ఉన్నట్లు సోమవారం ఉదయం గ్రామస్తులు గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తల, శరీరం సగభాగం కుళ్లిపోగా.. పోలీసులు, వైద్యులు సంఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై సురేందర్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


హరీశ్(ఫైల్)

కడెం: గత నెల పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామానికి చెందిన బత్తుల హరీశ్ (24) చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బత్తుల లక్ష్మి–రాజన్న దంపతుల రెండవ కుమారుడు హరీశ్ ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లి కొంతకాలంక్రితం స్వగ్రామానికి వచ్చాడు. గత నెల పురుగుల మందుతాగడంతో చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతికి కారణాలు తెలియరాలేదు. ఈ విషయమై పోలీసులకు సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గంజాయి కేసులో అరెస్టు

బెల్లంపల్లి: నిషేధిత గంజాయిని అక్రమంగా అమ్మకం, కొనుగోలు చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. టూటౌన్ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. ఈ నెల 4వ తేదీన చేపట్టిన వాహనాల తనిఖీలో మంచిర్యాలకు చెందిన రవితేజ అనే యువకుడు పట్టుబడగా అతడి వద్ద నుంచి 2కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆ కేసులో భాగస్వామి అయిన మందమర్రికి చెందిన మరో నిందితుడు మక్కల గంగాధర్‌ను అదుపులోకి తీసుకుని విచారించామని తెలిపారు. తమకు మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన విశ్వదేవ్ మిస్త్రీ అనే వ్యక్తి గంజాయిని అమ్మాడని చెప్పడంతో చంద్రపూర్‌కు వెళ్లి నిందితుడు విశ్వదేవ్ మిస్త్రీని అరెస్టు చేసినట్లు వివరించారు. ఈ మేరకు ఇద్దరు నిందితుల వద్ద నుంచి 50 గ్రాముల గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కోర్టుకు పంపామని వెల్లడించారు. సమావేశంలో టూటౌన్ ఎస్సై డి.రమేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యూఎస్‌ఏ సమ్మిట్‌కు నిర్మల్ విద్యార్థిని


గ్రీన్ స్కిల్స్ అకాడమీ, టాస్క్ బృందం సభ్యులతో మనాల్ మునీర్(బురఖా ధరించిన యువతి)

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థిని 'మనాల్ మునీర్' అరుదైన ఘనతను సాధించింది. గ్రీన్ స్కిల్స్ అకాడమీ, టాస్క్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'పర్యావరణం–సుస్థిరాభివృద్ధి' ప్రాజెక్టులో విజేతగా నిలిచి యూఎస్‌ఏలో నిర్వహించనున్న వన్‌ఎం వన్‌బి సమ్మిట్‌కు ఎంపికైంది. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గల టీ–హబ్ కేంద్రంలో టాప్ 17 పోటీదారులకు చివరి ఆడిషన్‌ను సోమవారం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టులో దాదాపు 7వేల మంది విద్యార్థులు పాల్గొనగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని దీక్ష డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బీజెడ్‌సీ ఫైనలియర్ చదువుతున్న మనాల్ మునీర్ టాప్ ఐదుగురిలో చోటు సంపాదించింది. ఈనెల చివరి వారంలో అమెరికాలో నిర్వహించే యునైటెడ్ నేషన్ సమ్మిట్‌నందు ఈమె పాలుపంచుకోనున్నారు. మానవగ్రహం అన్వేషణ, ప్రకృతి పరిరక్షణ, సాంకేతికత వినియోగం వంటి చర్యలను చేపట్టే విధానాలను ఇందులో అధ్యయనం చేయనున్నారు. మానవ మనుగడ, ప్రకృతి పరిరక్షణ, గ్రీన్ కారిడార్ నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే అంశాల పట్ల ఇందులో చర్చించనున్నట్టు పేర్కొన్నారు. అమెరికాలో నిర్వహించే సమ్మిట్ కు తమ సంస్థ విద్యార్థిని హాజరుకానుండడంపట్ల దీక్ష విద్యాసంస్థల డైరెక్టర్ వెంకట్ రెడ్డి, ప్రమోదరావు, ప్రిన్సిపల్ మెంగ శ్రీధర్, అధ్యాపకులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- ఆలస్యంగా గుర్తించిన కుటుంబీకులు


సాయికుమార్ (ఫైల్)

నేరడిగొండ: మండలంలోని దర్శన జిన్నింగ్ సమీపంలో గల జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ప్రమాదంలో మృతుడి తల నుజ్జునుజ్జు కాగా గుర్తుపట్టలేక ఉండడంతో మృతదేహాన్ని బోథ్ మార్చురీకి తరలించారు. కాగా, మృతదేహం వడూర్ గ్రామానికి చెందిన కత్తులపురం సాయికుమార్ (23)గా కుటుంబ సభ్యులు సోమవారం గుర్తించారు. సాయి రెండు రోజుల క్రితం నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండలం చాక్‌పల్లి గ్రామానికి చెందిన వారి బంధువుల ఇంటికి వెళ్లినట్లు కుటుంబీకులు తెలిపారు. అయితే ఆదివారం తిరిగి వస్తానని చెప్పినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. అదే రాత్రి ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఐటీడీఏ పీవోను కలిసిన కార్మికులు


పీవోను సన్మానిస్తున్న కార్మికులు

ఖానాపూర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో పాటు శానిటేషన్ కార్మికులు సోమవారం ఐటీడీఏ పీవో కుష్బూగుప్తాను ఉట్నూర్‌లో కలిశారు. కార్మికుల నెలసరి వేతనం రూ. 2 వేలు అదనంగా పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పీవోను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కేబీసీ నారాయణ, నాయకులు హుస్సేన్, రాజేందర్, రమేశ్, రాంచందర్, మల్లేశ్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు

ఆదిలాబాద్‌టౌన్: తాంసి మండలంలోని కప్పర్లకు చెందిన కేమ నందుపై సోమవారం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు అధికారి, ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కప్పర్లకు చెందిన కొల్లూరి చిన్న గంగన్న కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 6న రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటికి వెళ్తుండగా కేమ నందు అకారణంగా కులం పేరుతో దూషించాడు. ఆయనపై దాడి చేయగా కింద పడిపోయాడు. అలాగే గ్రామంలోని మంద ఏరియా వద్ద ఏర్పాటు చేసిన ఐదు సిమెంట్ బల్లలను ధ్వంసం చేశాడు. వాటిపై కూర్చున్న ప్రభాకర్‌పై కూడా దాడికి పాల్పడ్డాడు. సీసీ కెమెరాలు సైతం ధ్వంసం చేశాడు. బాధితుడు తాంసి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, డీఎస్పీ సోమవారం గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇది వరకు ఆయనపై ఐదు పాత కేసులు ఉన్నాయి. ఈ క్రమంలో నందుపై రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఉపాధ్యాయులు లేక మూతబడిన పాఠశాల


తాళం వేసి ఉన్న రాజూరా పాఠశాల

కుభీర్: మండలంలోని రాజూరా ప్రాథమిక పాఠశాలకు సోమవారం ఉపాధ్యాయులు రాక తాళం తీయకపోవడంతో విద్యార్థులు కొద్దిసేపు బయట కూర్చొని ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ పాఠశాలలో 30 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా సీఆర్‌టీ మాత్రమే అప్పుడప్పుడు పాఠశాలకు వస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై కాంప్లెక్స్ హెచ్‌ఎం సాయన్నను వివరణ కోరగా సీఆర్‌టీని బడికి పంపించామన్నారు. సీఆర్‌టీ ఆనంద్‌ను అడగగా తాను కుభీర్ హరిజవాడ పాఠశాలకు వెళ్లానని చెప్పారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి


లేగదూడ కళేబరాన్ని మట్టిలో పూడుస్తున్న కుటుంబ సభ్యులు

బజార్‌హత్నూర్: మండలంలోని గిరిజాయి గ్రామ పంచాయతీ పరిధి ఉమార్డ బీట్ అటవీ ప్రాంతంలో చిరుత దాడిలో లేగదూడ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎఫ్‌బీవో వివేక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గత శనివారం బద్దునాయక్‌తండా గ్రామానికి చెందిన జాదవ్ పూల్‌సింగ్ తన పశువులను మేత కోసం ఉమర్డ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి తీసుకవచ్చే క్రమంలో లేగదూడ తప్పిపోయింది. రెండు రోజులుగా గాలించగా అటవీ ప్రాంతంలో లేగదూడ కళేబరం లభ్యమైంది. అటవీ అధికారులకు అందిన సమాచారం మేరకు అక్కడికి చేరుకొని అడుగుల ఆధారంగా చిరుతగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. రైతుకు పరిహారం అందేలా చూస్తామని తెలిపారు. పశువులను అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లకూడదని రైతులకు సూచించారు.

నాన్ బెయిలబుల్ వారెంట్‌పై ఇద్దరి అరెస్ట్

- పరారీలో మరో ఇద్దరు

మంచిర్యాలక్రైం:వరకట్నం వేధింపుల కేసుల్లో కోర్టు విధించిన వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న ఇద్దరిని నాన్ బెయిలబుల్ వారెంట్(ఎన్‌బీడబ్ల్యూ)పై అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ కె.నరేశ్ కుమార్ సోమవారం తెలిపారు. హైదరాబాద్ ఘట్‌కేసర్‌కు చెందిన గుడి మోజేష్‌తో మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన పల్లె రామస్వామి–నాగమ్మ దంపతుల కూతురు సరితతో 2005లో వివాహం జరిపించారు. వివాహ సమయంలో సరిత తల్లిదండ్రులు రూ.3లక్షలు నగదు, 9 తులాల బంగారు ఆభరణాలు కట్నంగా ఇచ్చారు. కొంత కాలం వీరి దాంపత్య జీవితం బాగానే సాగింది. ఈ క్రమంలో కూతురు, కుమారుడు జన్మించారు. తర్వాత సరిత, మోజేష్ మధ్య గొడవలు మొదలయ్యాయి. మోజేష్‌తోపాటు అతని అన్న సాల్మాన్‌రాజ్, వదన ఏస్తేరు, తమ్ముళ్లు ఫిలిప్, కృపానందం సరితను అదనపు కట్నాం కోసం శారీరకంగా, మానసికంగా వేధించారు. బాధితురాలు 2019లో ఫిర్యాదు చేయగా మోజేష్, సాల్మాన్‌రాజు, ఏస్తేరు, ఫిలిప్, కృపానంద్‌పై వరకట్నం వేధింపుల కేసు నమోదైంది. నిందితులు కోర్టు విధించిన వాయిదాలకు హాజరు కాకపోవడంతో న్యాయమూర్తి కె.నిరోష నలుగురిపై ఎన్‌బీడబ్ల్యూ వారంట్ జారీ చేశారు. దీంతో మహిళా పోలీస్ స్టేషన్ ప్రత్యేక సిబ్బంది వి.రాజేశ్, ఎంఏ.నిసార్ అహ్మద్, జి.రామేశ్వర్‌రావు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం కృపానందం, ఫిలిప్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో లక్సెట్టిపేట జైలుకు తరలించారు. సాల్మాన్‌రాజ్, ఏస్తేరు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.